క్లుప్తంగా

స్కూల్ లైబ్రరీకి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు శాంతకుమార్

తెర్లాం: పెరుమాళి గ్రామంలోని మోడల్ స్కూల్ లైబ్రరీకి జగన్నాథవలస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గర్భాపు శాంతకుమార్ 150 పుస్తకాలను సోమవారం అందజేశారు. తన సోదరుడు, లైఫ్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దివంగత గర్భాపు పుష్పనాథం జ్ఞాపకార్థం స్కూల్ లైబ్రరీకి పుస్తకాలు అందజేశామని దాత తెలిపారు. ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి ఎంఈఓగా రమేష్



ఎంఈఓ రమేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్టీయూ సంఘ ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ)గా సీహెచ్.రమేష్‌కుమార్ స్థానిక ఎమ్మార్సీలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన చల్లా లక్ష్మణరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో బొబ్బిలి బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎంఈఓ సీహెచ్.రమేష్ కుమార్‌ను ఎంఈఓ-1గా ఉన్నతాధికా రులు నియమించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, సభ్యులు జి.రవి, మోజేష్, కృష్ణదాస్ తదితరులు ఎంఈఓ రమేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రైతు సంఘం నాయకుడు మృతి



లక్ష్మునాయుడు(ఫైల్)

రేగిడి: రైతు సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన మండల కేంద్రానికి చెందిన రైతు సంఘం నాయకుడు శాసుబిల్లి లక్ష్మునాయుడు (90) సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు నాయుడు లక్ష్మునాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే రేగిడి జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌హనరావు తదితరులు నివాళులర్పించారు.

ఆకట్టుకున్న ' కెరటాలు '



నాటికలో ఓ దృశ్యం

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని కళాభారతి వేదికపై రాజాం-డోలపేట కళాక్రియేషన్స్ ప్రదర్శించిన కెరటాలు సాంఘిక నాటిక పలువురిని ఆకట్టు కుంది. కళా క్రియేషన్స్ 75వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి నాటికను ప్రదర్శించారు. నంది అవార్డు గ్రహీతలు శాసపు సత్యనారాయణ, లీలామోహన్‌తో పాటు లలితారాణి, టీవీ, రేడియో కళాకారులు గోకవలస కృష్ణమూర్తి, తోలేటి రామారావు, శ్రీధర్ తదితరులు ఈ నాటికలో అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ నాటికను పద్మశ్రీ యడ్ల గోపాలరావు, కళా క్రియేషన్స్ అధ్యక్షుడు కొత్త సాయిప్రశాంత్‌కుమార్ తదితరులతో పాటు రాజాం పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆద్యాంతం తిలకించి, నటులను అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మరిచెర్ల గంగారావు

వంగర: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి బోధనకే పరిమితం చేయాలన్నారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధిచి 18 రకాల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రూ.25వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, 12వ పీఆర్‌సీ నియమించాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలుపై ఫ్యాప్టోతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

కాదేదీ ఆక్రమణకు అనర్హం..!

- సాగునీటి,మురుగునీటి కాల్వలను వదలడం లేదు
- కూటమి అండదండలతో ఆక్రమణల్లో మున్సిపల్ స్థలాలు



అమ్మిగారి కోనేటిగట్టు వద్ద కొత్తగా చేపడుతున్న నిర్మాణాలు



పాత బొబ్బిలి రోడ్డు పక్కన రెండు రోజుల్లో వెలసిన మూడు దుకాణాలు

బొబ్బిలి: కూటమి పాలనలో బొబ్బిలి పట్టణంలో ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్నతీరుగా పరిస్థితి తయారైంది.పట్టణంలోని మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీలోని స్థలాలను పలువురికి కట్టబెడుతున్నారు. ఇటీవలే మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మానంతో అధికార మార్పిడి జరగడంతో ఈ ఆక్రమణలు మరింతగా జోరందుకున్నాయి. పట్టణంలోని పాత బొబ్బిలి, అమ్మిగారి కోనేటి గట్టు, పూల్‌భాగ్ ఏరియా, మెయిన్‌రోడు ప్రాంతాల్లోని పలు స్థలాల్లో కొత్తగా దుకాణాల పేరుతో శాశ్వత నిర్మాణాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది.

మొదట్లో తాత్కాలిక నిర్మాణాలని..

పట్టణంలోని కూటమి నాయకులు కొంత మందికి తాత్కాలికంగా రేకులషెడ్డు నిర్మించుకోమని ఆదేశాలిచ్చారు. కానీ చాలామంది ఎటు వంటి అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. కేవలం కూటమి నాయకుల కనుసన్నలతో, వారి మౌఖిక ఆదేశాలతో ఈ నిర్మాణాలు చేపడుతుండడంతో స్థానికులు విస్తుపోతున్నారు.

నీరు పారే మార్గం లేకుండా..

పాత బొబ్బిలి, అమ్మిగారి కోనేటి గట్టు ప్రాంతాల్లో ఆక్రమణలు మరీ దారుణంగా ఉన్నాయి. ఇక్కడ రోడ్ల పక్కన ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలంతో పాటు సాగునీరు,మురుగు నీరు పారే స్థలాలను కూడా ఆక్రమించుకుంటున్నారు. దీంతో అధికంగా నీరు పారే సమయాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. అంతేకాదు భవిష్యత్‌లో కాలువలు నిర్మించాల్సిన ప్రాంతాలను కూడా వదలడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారన్న విమర్శలు స్థానికుల నుంచి బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అసలు ఈ నిర్మాణాల సమయంలో అధికారులు పర్యటించినప్పటికీ చూసీ చూడనట్టు వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులై ఉండీ ప్రభుత్వ స్థలాలను ఇలాగేనా వదిలేసేదని పలువురు విమర్శిస్తున్నారు.

పరిశీలిస్తా..

ఆక్రమణలు జరుగుతున్నాయా..? ఏయే ప్రాంతాల్లో జరుగుతున్నాయో పరిశీలిస్తా. ఇప్పడి వరకు ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో, జరుగుతున్నాయో పూర్తి వివరాలు సేకరిస్తాం.

– ఫిలిప్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్, బొబ్బిలి మున్సిపాలిటీ

ఈ ఫోన్లతో పనిచేయలేం..

- ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాలకు ఫోన్లు వెనక్కు ఇచ్చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



రాజాంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బాడంగిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రాజాం/ బాడంగి: : ఆన్‌లైన్ సేవలందించాలని, యాప్‌ల్లో వివరాలు అప్‌లోడ్ చేయాలంటూ ప్రభుత్వం తమపై ఒత్తిడి పెట్టడం తగదని, పని చేయని ఫోన్లతో సమాచారం పంపించడమంటే తమ వల్ల కాదని నినాదాలు చేస్తూ రాజాం నియోజకవర్గ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు రాజాం ఐసీడీఎస్ పీఓ కార్యాలయం వద్ద, బొబ్బిలి నియోజకవర్గం లోని బాడంగి ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు బాడంగిలోని ఐసీడీఎస్ పీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. వీరికి సీఐటీయూ మద్దతు తెలిపింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లతో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంపించలేక అంగన్‌వాడీ కార్యకర్తలు గుండెపోటు, బీపీ, సుగర్ వంటి వ్యాధులకు గురై చనిపోతున్నారని ఆరోపించారు. గతంలో మాదిరిగా ఆఫ్‌లైన్ ద్వారా సేవలు అందిస్తారని, కాదు కూడదని ప్రభుత్వం మొండి పట్టు పడితే ఉద్యోగుల తరపున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎక్కడా నెట్ సిగ్నల్స్ లేక ఎఫ్ఆర్ఎస్ అమలుకావడంలేదని, ఈ విధానాన్ని రద్దుచేయాలని వివరించారు. కొంతమంది అంగన్‌వాడీ కార్య కర్తలు మాట్లాడుతూ మాతృవందనం పథకం అమలు చేయలేమని స్పష్టం చేశారు. కేంద్రాలకు ఇచ్చిన ఫోన్‌లు ద్వారా లబ్ధిదారులు ఫోటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ నిబంధనలు పెట్టి సరుకులు ఇవ్వాలంటే చాలా ఇబ్బందులు వస్తున్నాయని, ఈ విధానం అమలుచేయలేమని పేర్కొన్నారు. అనేకరకాలైన యాప్ సర్వీసులన్నీ ఒకే యాప్‌గా మార్చాలని, ఎఫ్ఆర్ఎస్, ఇన్, ఔట్ వంటివి రద్దు చేయాలని, సెంటర్ల నిర్వహణకు ట్యాబులు ఇవ్వాలని, 5జీ నెట్ సేవలు అందించాలని కోరారు. అనంతరం ఫోన్లను సంచుల్లో పెట్టి కార్యాలయాలకు అందజేశారు. రాజాంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాజాం యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రూపవతి, జయలక్ష్మిలు, సెక్టార్ లీడర్స్ సుజాత, పార్వతి, భారతి, సునీత, దమయంతి, ధవలేశ్వరి, అనూరాధ, ప్రమీల, సుశీలకుమారి, బాడంగిలో సీఐటీయూ జిల్లాకమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘ జిల్లా అధ్యక్షులు రమణమ్మ, మండల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రమణమ్మ,సీత,జ్యోతి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీలను ఎగ్గొంటేందుకే పీ-4 అంటూ డ్రామాలు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



కూటమి హామీలపై మహిళలను ప్రశ్నిస్తున్న శంబంగి, తదితరులు

బొబ్బిలి: తనకు అనుభవం ఉందని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని ఎన్నికల సమయంలో ఇష్టారీతిగా హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు... ఇప్పుడు వాటిని ఎగ్గొంటేందుకు పీ-4 అంటూ డ్రామాలు మొదలు పెట్టారని బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమ న్వయకర్త,మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పట్టణంలోని 15వ వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించారు. శంబంగి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తొలి ఏడాదిలోనే అమలు చేయడంతో పాటు నాలుగేళ్లు కొనసాగించడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేక పోయారన్నారు. దీంతో రాష్ట్రాన్ని అప్పులమయం చేస్తున్నారనీ, మరో శ్రీలంకలా రాష్ట్రాన్ని తయారు చేస్తున్నారని అప్పట్లో ప్రచారం చేశారన్నారు. కానీ గడచిన ఎన్నికల్లో మాత్రం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలన్నింటినీ తామూ కొనసాగిస్తామని, అంతకు మించి అదనంగా సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు పత్తా లేకుండా పోయారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాల రావు, ఎస్.వి. మురళీ కృష్ణారావు, వార్డు ఇన్‌చార్జి మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి,కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ జెర్సీల పంపిణీ



విద్యార్థినులకు జెర్సీలు అందజేస్తున్న దాతలు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 52 మంది విద్యార్థులకు అదే పాఠశాలలో 1985-87 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ జెర్సీలు సమకూర్చారు. వీటిని పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బి.వి.అచ్యుత్‌కుమార్, పీడీ బేత శ్రీనివాసరావు సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు జగదీశ్వరరావు, తిరుమలేష్, మాతా గంగాధర్, హనుమంతరావు, శ్రీనివాసరావు తెలిపారు.ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా విధులు నిర్వర్తించాలి



స్ట్రెస్‌మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న బీకే రాజేశ్వరి అక్కయ్య

బొబ్బిలి: ఉద్యోగులు ఒత్తిడి లేకుండా విధులు నిర్వర్తించేందుకు యోగా సాధన ఎంతో అవసరమని బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి అక్కయ్య అన్నారు. పట్టణంలోని ఉపఖజానా కార్యాలయంలో ఎస్టీఓ పీవీ పద్మనాభం ఆధ్వర్యంలో బిల్లుల ప్రాసెసింగ్‌లో మెలకువలపై సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు.స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ రిలీఫ్ టెక్నిక్‌లను ఉద్యోగులకు బీకే రాజేశ్వరి వివరించారు. అనంతరం ఉద్యోగులకు రాఖీ కట్టి, పర్వదిన ఔన్నత్యాన్ని తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



బొబ్బిలి:ఆర్డీఓకు వినతిపత్రం అందజేసి సమస్యలపై చర్చిస్తున్న జర్నలిస్టులు



వంగర: తహసీల్దార్ హరి రమణారావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



బాడంగి: హెచ్‌డీటీ ధనానికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టుల సంఘం



రామభద్రపురం: తహసీల్దార్ అజూ రఫీ జాన్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

బొబ్బిలి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి నిర్మాణ పథకాల్లో అర్హులుగా వెంటనే చేర్చాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రేగులవలస వ్యాస్‌బాబు, బొబ్బిలి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస రావు కోరారు. జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా ఏపీడబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు స్థానిక జర్నలిస్టులు సోమవారం ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్.రామమోహనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ఆర్డీఓతో చర్చించారు. ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు. చుక్క జగన్,తెంటు రమేష్, ఆచారి ఆదినారాయణ, రఘునాథరావు, వెంకీ,శంకరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం/ వంగర/ బాడంగి: జర్నలిస్టుల సమస్యలను పరిష్కారించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేసింది.ఈ మేరకు రామభద్రపురం, వంగర మండ ల జర్నలిస్టులు ఆయా మండలాల తహసీల్దార్‌లు అజూ రఫీ జాన్, హరి రమణారావు, బాడంగిలో హెచ్‌డీటీ ఆర్.ధనానికి ఆ మండల జర్నలిస్టులు సోమవారం వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు చాలా ఏళ్లుగా అపరిష్కృతంగా ఉందని,ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జర్నలిస్టులకు ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రణాళికలో ప్రకటించడంతో అందరూ ఆశగా ఎదురు చూస్తున్నా రన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికీ మూడు సెంట్లు చప్పున్న కేటాయిస్తామని దరఖాస్తులు స్వీకరించిందని,ఆ దరఖాస్తులు ఆధారంగానే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ఈ ప్రభుత్వం జీఓ జారీ చేయాలన్నారు.కార్మిక బీమా, ఆరోగ్య బీమా అమలుకు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలని కోరారు.చొక్కాపు నారాయణరావు,ఆకుల వెంకటరావు సత్యారావు,చొక్కాపు రామకృష్ణ, డర్రు రాంబాబు, గంటా నారాయణస్వామి, జి.కృష్ణమూర్తి,ఎస్.రాజాసాహెబ్,ఆర్.నాగరాజు,ఎస్.అమర్,కె.శామ్యూల్, టి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

తెర్లాం: విధి నిర్వహణలో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఎంపీడీఓ రేగి రాంబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని, పీ-4 సర్వేలో బంగారు కుటుంబాల ఎంపికను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేయిస్తుండాలని సూచించారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

బొబ్బిలిరూరల్: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బుడా) ఆధ్వర్యంలోని అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని బుడా అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ అంశంపై యజమాను లకు అవగాహన కల్పించాలని చెప్పారు. బుడాపరిధిలో కొత్త భవనాల నిర్మాణాలకు అనుమతులు తప్ప నిసరి అని, అనుమతుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకున్నా సరే పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని వివరించారు. గ్రామాల్లో పదిమీటర్లకు మించి ఎత్తులో భవనాల నిర్మాణాలకు అనుమతులు లేవని,పూర్తిగా నిషేదమని తెలియజేశారు. ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న వక్తలు

రేగిడి: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు.మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో సోమవారం విద్యార్థులు, భక్తులకు ఉచిత ధ్యాన, యోగా తరగతులు నిర్వహించారు.పలువురు వక్తలు నైతిక వికాసాన్ని వివరించారు. సత్య సాయిభజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాబు గ్యారెంటీ అంతా బూటకమే



చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న డాక్టర్ తలే రాజేష్,తదితరులు

రాజాం: ఎన్నికల ముందు 'బాబు ష్యూరిటీ' పేరుతో ఇచ్చిన బాండ్లన్నీ ఫేక్ బాండ్లేనని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రాజాం పట్టణంలోని ఎస్సీకాలనీ చిన్నవీధిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజేష్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి గతంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు,పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన గ్యారెంటీ బాండ్లపై ఆరా తీశారు.బాండ్లలో పేర్కొన్న ఏ ఒక్క హామీనైనా కూటమి ప్రభుత్వం నెరవేర్చిందా అని ప్రజలను అడిగారు. అధికారం కోసం ఈ అబద్దాలన్నీ ఆడారని, ఇప్పుడు నిధులు లేవని, అప్పులు చేయాలని చేతులెత్తేయ డం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.ఇటువంటి నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవస రం ఉందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు కూటమి నేతలను విడిచిపెట్టవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి నేతలు గ్రామాల్లో దోపిడీలు, ఆక్రమణలు, దౌర్జన్యాలు చేస్తున్నారని, ఇటువంటి అరాచకాలను సహించవద్దని ప్రజలకు సూచించారు. మీ వెంట మేం ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఆసపు సూర్యం, పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం కన్వీనర్ పాలవలస శ్యాంసుందరరావు, జిల్లా కల్చరల్ విభాగం కన్వీనర్ డాక్టర్ నరేంద్ర, మహిళా నాయకులు అల్లెన జయలక్ష్మి, మున్సిపల్ విభాగం కార్యదర్శి శాసపు వేణుగోపాల నాయుడు, ఆర్‌టీఐ విభాగం కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, పిట్టా జగదీష్, గోకవలస బాబూరావు, గార సత్యనారాయణ, భవానీ శంకరరావు, షీక ప్రసాద్, బోనెల రాజేష్, గుండాల తేజ, షీక గణేష్, సాయిశివ, జంగం చంటి, ముగడ రవి, చిన్న పాల్గొన్నారు.

రైతులపై అదనపు భారం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వ వైఖరి వల్ల రైతులు, పాడి రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల్లో(ఆర్ఎస్‌కే) ఎరువులు, పశువుల మందులు లభించడం లేదన్నారు. ఆర్ఎస్‌కేలకు పశువుల మందులు సరఫరా చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. పాడిరైతులు మందులను ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఆర్ఎస్‌కేల్లో రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయడం లేదని, రైతులు నానాపాట్లు పడాల్సివస్తోందన్నారు.ఒక వేళ మండలంలోని ఏదో ఒక ఆర్ఎస్‌కేకు ఎరువులు వచ్చినా ఏదో లింక్ నంబర్ రాలేదని చెబుతూ అధికారులు ఒకట్రెండు రోజులు పంపిణీ చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పశువుల మందులు, ఎరువులు లభించేవని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కె.అప్పారావు,ఎస్.రామారావు,ఎం.రామారావు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం



బొబ్బిలిరూరల్: పక్కి గ్రామంలో మాట్లాడుతున్న పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: పుట్టినప్పటి నుంచి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడమే శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీఓ జె.విజయ లక్ష్మి అన్నారు. మండలంలోని పక్కి,మెట్టవలస తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అతిథిగా హాజరైన పీఓ మాట్లాడుతూ తల్లి పాలలో సంపూర్ణ పోషకాలు ఉంటాయన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే అరగంట తర్వాత ముర్రుపాలు పట్టించాలని చెప్పారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజు,మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనాయవలసలో...

తెర్లాం: కూనాయవలసలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతను, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. గ్రామ సర్పంచ్ బోడెల విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని లచ్చన్నవలస, తాటిపాడు, వావిలవలస తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు.ఆరు నెలల లోపు పిల్లలకు తల్లిపాలు అందించాల్సిన ఆవశ్యకత, చిన్నారులకు అందించాల్సిన పోషకాహారం గురించి అతిథిగా హాజరైన నూకాలమ్మ బాలింతలకు వివరించారు. పిల్లల ఎదుగుదల బాగుండాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని అన్నారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు



అంబఖండిలో కాలిబాటలు తీయిస్తున్న ఏఈఓ విజయలక్ష్మి

రేగిడి: ఖరీఫ్ వరిసాగులో కాలి బాటలు తీయడం ద్వారా బహుయ ప్రయోజనాలు చేకూరుతాయని, రైతులు తప్పనిసరిగా తమపొలాల్లో కా లిబాటలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని వావిలవలస, లింగాలవలస గ్రామాల్లో వీపీఏలు సోమవారం వరినాట్లు పరిశీలించారు. కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, వాటిని ఏర్పాటు చేసుకునే విధానాన్ని వివరించారు. కాలిబాటల వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగులుతుందని, తద్వారా తెగుళ్ల సోకవని చెప్పారు. ఎరువులు వేసుకునేందుకు కూడా సౌలభ్యంగా ఉంటుందని వివరించారు.